నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 26 నవంబర్ 2024 | SURYAPET

దీక్షా దివస్‌కు భారీ ఏర్పాట్లు

ఇప్పటికే జిల్లాల వారీగా ఇన్‌చార్జిల నియామకం
నేడు జిల్లాల వారీగా సన్నాహక సమావేశాలు
హాజరుకానున్న పార్టీ నేతలు, కార్యకర్తలు
ఈ నెల 29న పెద్దఎత్తున నిర్వహణకు కార్యచరణ

నల్లగొండ ప్రతినిధి, నవంబర్25(నమస్తే తెలంగాణ) : ఆనాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమనేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ దీక్షకు పూనుకున్న రోజు.. నవంబర్ 29వ తేదీన ఉమ్మడి జిల్లాలో భారీ ఎత్తున దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్ సన్నద్ధం అవుతున్నది. ఆనాటి ఉద్యమాన్ని గుర్తు చేసుకుంటూ మళ్లీ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో రగిలించేలా దీక్షా దివస్ నిర్వహణకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అందుకనుగుణంగా జిల్లాల వారీగా దీక్షా దివస్‌ను పెద్దఎత్తున నిర్వహించేలా పార్టీ ఏర్పాట్లు చేస్తున్నది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ఉమ్మడి జిల్లాలో పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా నేతలంతా దీక్షా దివస్ సక్సెస్ కోసం రంగంలోకి దిగనున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా ఇన్‌చార్జిలను సైతం కేటీఆర్ ప్రకటించారు. అందులోభాగంగా నేడు జిల్లాల వారీగా పార్టీ కార్యాలయాల్లో సన్నాహక సమావేశాలకు సిద్ధమయ్యారు. దీనికి పార్టీలోని అన్నిస్థాయిల్లోని నేతలను, ముఖ్యులను ఆహ్వానించారు.

రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి నేతల వరకు ఆహ్వానం

దీక్షా దివస్ కార్యక్రమం విజయవంతం కోసం మంగళవారం నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు. సన్నాహక సమావేశాల కోసం ఇప్పటికే పార్టీ జిల్లా కార్యాలయాలను సిద్ధం చేశారు. ఆదివారం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలంతా విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి దీక్షా దివస్ ప్రాధాన్యతను విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఇక సోమవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహబూబాబాద్ మహాధర్నాకు తరలివెళ్తుంటే ఉమ్మడి జిల్లా పార్టీ నేతలు, ముఖ్యులంతా అడుగడుగునా స్వాగతం పలుకుతూ అభిమానాన్ని చాటుకున్నారు. ఇక మంగళవారం దీక్షా దివస్ కార్యక్రమ విజయవంతం కోసం సన్నద్ధం అవుతున్నారు. అందులోభాగంగా పార్టీ జిల్లా కార్యాలయాల్లో వందలాది మందితో సమావేశాలకు ఏర్పాట్లు చేశారు. దీని కోసం పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నేతలతోపాటు అన్ని స్థాయిల్లోని ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులను, గ్రామశాఖ, అనుబంధ సంఘాల నేతల వరకు ఆహ్వానించారు. వీరంతా నేడు సమావేశాలకు తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు. యదాద్రిభువనగిరి జిల్లా సన్నాహక సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు భువనగిరిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నారు. దీనికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. మధ్యాహ్నం 1గంటకు నల్లగొండ జిల్లా సన్నాహక సమావేశం నల్లగొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి జగదీశ్‌రెడ్డితో పాటు ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. ఇక సూర్యాపేటలో మధ్యాహ్నం 3 గంటలకు పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశానికి ఏర్పాట్లు చేశారు. జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అధ్యక్షతన జరిగే సమావేశానికి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో పాటు దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. కాగా ఇప్పటికే నియోజకవర్గాల వారీగా మాజీ ఎమ్మెల్యేలంతా దీక్షా దివస్ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని పార్టీ నేతలు, కార్యకర్తలంతా సన్నాహక సమావేశాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మండలాల వారీగా పార్టీ బాధ్యులకు పని విభజన చేస్తూ భారీ ఎత్తున తరలివచ్చేలా రంగం సిద్ధం చేశారు.

అర్వపల్లి : మాజీ జడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్ బహూకరించిన ఖడ్గంతో మాజీ మంత్రి కేటీఆర్, పక్కన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్

కేటీఆర్‌కు అడుగడుగునా ఘన స్వాగతం

- భారీగా తరలొచ్చిన పార్టీ నేతలు, శ్రేణులు
- మండల కేంద్రాల్లో ఎదురేగి స్వాగతాలు
- సీఎం.. సీఎం.. అంటూ నినాదాల హోరు
- చౌటుప్పల్‌లో ట్రిపుల్‌ఆర్ బాధితుల వినతిపత్రాల స్వీకరణ
- అన్నిచోట్లా అభివాదం చేస్తూ ముందుకు సాగిన కేటీఆర్

ఉమ్మడి జిల్లా మీదుగా మహబూబాబాద్ వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

నల్లగొండ ప్రతినిధి, నవంబర్25 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఘన స్వాగతం లభించింది. పొద్దుపొద్దున్నే చలి వణికిస్తున్నా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతోపాటు సామాన్యులు సైతం కేటీఆర్ ప్రయాణించే దారి పొడువునా రోడ్లపైకి వచ్చారు. లగచర్లలో దళిత, గిరిజన రైతులపై ప్రభుత్వ ఆమానుషత్వాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మహబూబాబాద్‌లో మహాధర్నాను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదుగా మహబూబాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. ఈ విషయం తెలిసిన ఉమ్మడి జిల్లా పార్టీ నేతలు, కార్యకర్తలు, శ్రేణులంతా పెద్ద ఎత్తున కేటీఆర్‌పై అభిమానం చూపుతూ స్వాగతం పలికేందుకు తరలివచ్చారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నేతలు తమ తమ ప్రాంతాల్లో కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు పోటీపడ్డారు. హైదరాబాద్ నుంచి బయల్దేరిన కేటీఆర్‌కు ఉమ్మడి జిల్లా సరిహద్దు ప్రాంతమైన పోచంపల్లి క్రాస్ రోడ్స్ కొత్తగూడెం వద్ద ఘన స్వాగతం లభించింది. అక్కడ నల్లగొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, పార్టీ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. పూలు చల్లుతూ, పుష్పగుచ్ఛాలిస్తూ శాలువాలు కప్పి కేటీఆర్ పట్ల అభిమానాన్ని చాటుకున్నారు. అక్కడి నుంచి కేటీఆర్ కాన్వాయ్ చౌటుప్పల్‌కు చేరుకోగా అక్కడ కూడా పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు ఎదురేగి స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నేత పాల్వాయి స్రవంతి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛాలు అందించారు. ఇక్కడ ట్రిపుల్ ఆర్ బాధితులు కేటీఆర్‌ను కలిసి తమ గోడును వినిపించారు. అలైన్‌మెంట్‌లో మార్పులు చేసేలా, మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ అసెంబ్లీలో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ట్రిపుల్ ఆర్ బాధితులు తెలిపారు. అక్కడ నుంచి చిట్యాల మండల కేంద్రానికి కేటీఆర్ కాన్వాయ్ చేరుకుంది. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. కేటీఆర్ తన వాహనం నుంచే అభివాదం చేసేందుకు బయటకు రాగా ఒక్కసారిగా పార్టీ శ్రేణులంతా ''సీఎం..సీఎం.. సీఎం.. కేటీఆర్ జిందాబాద్... కేటీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి'' అంటూ నినాదాలు చేశారు. పార్టీ నేతలు ఇచ్చిన పుష్పగుచ్ఛాలను, శాలువాలను స్వీకరిస్తూ... నమస్కారం చేస్తూ అక్కడి నుంచి ముందుకు కదిలారు. నార్కట్‌పల్లి మండలంలోకి ప్రవేశించగానే అక్కడ పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు కేరింతలు కొడుతూ స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, పార్టీ రాష్ట్ర నేత కంచర్ల కృష్ణారెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. పూలుచల్లుతూ, బొకేలు అందిస్తూ, శాలువాలు కప్పి పార్టీ నేతలు కేటీఆర్ పట్ల తమ అభిమానాన్ని చాటారు. కేటీఆర్ కాన్వాయ్ విజయవాడ-హైదరాబాద్ హైవే నుంచి ఎన్‌హెచ్-365 మీదకు క్రాస్ అయ్యే నకిరేకల్ మండలం చందంపల్లి వద్ద కూడా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అక్కడ నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు భారీ స్వాగతం పలికారు. అక్కడి నుంచి అర్వపల్లి మండల కేంద్రానికి కేటీఆర్ కాన్వాయ్ చేరుకోగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో వేలాది మంది పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కేటీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి, కేటీఆర్ జిందాబాద్, సీఎం కేటీఆర్ అంటూ నినాదాలతో మండల కేంద్రం దద్దరిల్లింది. అక్కడ పార్టీ శ్రేణుల కోరిక మేరకు కాన్వాయ్ దిగి ఓపెన్ టాప్ జీప్‌లో కొద్దిదూరం ముందుకు కదిలారు. కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, మాజీ ఎంపీ, పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, పార్టీ నేతలు ఒంటెద్దు నర్సింహారెడ్డి, గుజ్జ యుగేంధర్‌రావులు ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం గాదరి కిశోర్‌కుమార్ ఆహ్వానం మేరకు అక్కడే అర్వపల్లి మాజీ జడ్పీటీసీ సభ్యుడు దావుల వీరప్రసాద్‌యాదవ్ ఇంట్లో తేనేటి విందు కోసం ఆగారు. అక్కడ పార్టీ నేతలు, కార్యకర్తలు కేటీఆర్‌తో ఫొటోల కోసం పోటీపడ్డారు. అనంతరం అక్కడి నుంచి బయల్దేరి పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ మరిపెడ బంగ్లా మీదుగా కేటీఆర్ మహబూబాబాద్‌కు వెళ్లారు.

చిట్యాలలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కేటీఆర్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లిలో మాజీ మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, బీఆర్ఎస్ శ్రేణులు

కొత్తగూడెం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, రవీంద్రకుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్,రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు

చౌటుప్పల్ : మాజీ మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



అర్వపల్లిలో కేటీఆర్ రాక కోసం ఎదురు చూస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కనుల పండువగా కోటి దీపోత్సవం

మట్టపల్లిలో కోటి దీపోత్సవంతో మిరుమిట్లు గొలుపుతున్న ఆలయ పరిసరాలు

మఠంపల్లి, నవంబర్ 24 : కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా మట్టపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కోటి దీపోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద ఎత్తున దీపాలు వెలగించడంతో ఆ ప్రాంతం శోభాయమానంగా మిరుమిట్లుగొలిపింది.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

రామగిరి, నవంబర్ 25 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ఈ నెల 26న జరుగాల్సిన డిగ్రీ 3,5వ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి జి.ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను డిసెంబర్ 12న నిర్వహించనున్నట్లు పెర్కొన్నారు. 28న జరుగాల్సిన పరీక్షలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

నాడు పోస్టింగ్‌లు.. నేడు ఊస్టింగ్‌లు

- కోదాడ మున్సిపాలిటీలో 105 మంది పారిశుధ్య సిబ్బంది నియామకం
- రెండున్నర సంవత్సరాలు సజావుగా వేతనాల చెల్లింపు
- ఇప్పుడు అవసరం లేదంటున్న అధికారులు
- వీధిన పడ్డ బడుగుల జీవితాలు
- వేతనాలు చెల్లించాలంటూ మున్సిపాలిటీ ఎదుట ధర్నా

వేతనాలు చెల్లించాలని ధర్నా నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది, కార్మికులు(ఫైల్)

కోదాడ, నవంబర్ 25 : దిన దినాభివృద్ధి చెందుతున్న కోదాడ పట్టణ ప్రజల అవసరాల దృష్ట్యా మూడు సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ చొరవతో మున్సిపాలిటీ పాలకవర్గం ప్రత్యేక తీర్మానం చేసి 75 మంది పారిశుధ్య సిబ్బందిని మరో 35 మందిని ఇతర పనులకు కాంట్రాక్టు పద్ధతిలో ఎంపిక చేశారు. ఎంపికైన వారంతా దళిత బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఎక్కువ. ఎంపికైన నాటి నుంచి రెండు సంవత్సరాల వరకు రెండు, మూడు నెలలకొక్కసారి అయినా వేతనాలు తీసుకున్నారు. అయితే సంవత్సరం నుంచి వారి కష్టాలు మొదలు అయ్యాయి. బడ్జెట్ లేదని, ఇక వేతనాలు ఇవ్వలేమని మున్సిపల్ కమిషనర్ తేల్చి చెప్పడంతో సదరు పారిశుధ్య సిబ్బంది బతుకులు వీధిన పడ్డాయి. వెన్నుదండుగా ఉండాల్సిన పాలకవర్గ సభ్యులు నోరు మెదపకపోవడంతో పారిశుధ్య సిబ్బంది అభద్రతా భావంతో ఆందోళన చెందుతున్నారు. 15 రోజుల క్రితం గత ఐదు నెలలుగా అందాల్సిన వేతనాల కోసం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తమ గోడును వెల్లబోసుకున్నారు.

కాంగ్రెస్ పాలనలో మొదలైన కష్టాలు

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హరితహారంతోపాటు ప్రత్యేక నిధుల నుంచి 105 మంది కార్మికులకు సజావుగా వేతనాలు చెల్లించారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన క్రమంలో హరితహారం కార్యక్రమం నిలిచిపోయింది. ఇక మున్సిపాలిటీకి పలు రూపాల్లో వసూలు అయిన డబ్బులు కాంట్రాక్టర్లకే వెచ్చించాల్సి వచ్చింది. ఈ దుష్పరిణామంతో 105 మంది కార్మిక సిబ్బందికి వేతనాలు ఇవ్వ డం భారంగా మారింది. వీరి ఎంపిక సీడీఎంఏ నిబంధనల ప్రకారం జరుగలేదని, తాత్కాలిక వేతనాలు చెల్లించే నిబంధనతోనే వీరు కొనసాగుతున్నారని, ప్రస్తుతం బడ్జెట్ లేనందున జీతాలు ఇవ్వలేమని మున్సిపల్ అధికారులు తెగేసి చెబుతున్నారు.

మభ్యపెడుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

మున్సిపాలిటీ పరిధిలోనే ఆయా వార్డుల్లో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు వార్డుకు ఇద్దరు చొప్పున 35 వార్డులకు గానూ 75 మందిని నియమించుకున్నారు. ఒకరు, ఇద్దరు అదనంగా కూడా నియమించుకున్నట్లు తెలిసింది. మెజార్టీ కౌన్సిలర్లు పారిశుధ్య సిబ్బందిని నియమించినందుకు వారి వద్ద నుంచి రూ.రెండు నుంచి మూడు లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఐదు నెలల నుంచి తమకు వేతనాలు అందడం లేదని, తమ పరిస్థితి ఏమిటని కౌన్సిలర్ల వద్ద తమ గోడును వెల్లబోసుకున్న నేపథ్యంలో మభ్య పెడుతున్నట్లు సమాచారం. గతంలో ఎంపిక అంశంలో ఆరోపణలు వచ్చినా కొందరు కౌన్సిలర్లు, ఈ అపవాదు తమకెందుకు అని తిరిగి తీసుకున్న సొమ్మును వాపసు చేసినట్లు తెలుస్తుంది. తమ వేతనాలు అందడం లేదని, ఉద్యోగాలకు భద్రత కల్పించాలని పారిశుధ్య సిబ్బంది స్థానిక ఎమ్మెల్యేను కలిసి మొరపెట్టుకున్నారు.

దీర్ఘకాలికంగా వేతనాలు ఇవ్వడం కష్టం

కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంపిక చేసిన 105 మంది పారిశుధ్య సిబ్బంది, కార్మికులకు దీర్ఘకాలికంగా వేతనాలు ఇవ్వడం కష్టం. ఈ అంశంలో మున్సిపల్ నిబంధనలు ఆమోదించవు. మానవతా హృదయంతో మాత్రమే వేతనాలు ఇస్తున్నాం. భవిష్యత్తులో ప్రభుత్వం నిబంధనలు సడలిస్తే ఔట్‌సోర్సింగ్ కింద వీరికి ప్రాధాన్యత ఇస్తామే తప్ప మేము చేయగలిగింది ఏమీ లేదు. సీడీఎం వైపు ప్రతిపాదన కూడా పంపాం. మరో రెండు నెలల వేతనం ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం.

- రమాదేవి మున్సిపల్ కమిషనర్

పారిశుధ్య సిబ్బందికి వేతనాలు చెల్లించాల్సిందే

తాత్కాలిక వేతనంపై ఎంపికైన 105 మంది సిబ్బందికి వేతనాలు తప్పనిసరిగా చెల్లించాలి. వారిలో మెజార్టీగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఉన్నారు. ఇందుకు పాలకవర్గంతో పాటు ఉద్యోగులు బాధ్యత వహించాలి. పారిశుధ్య సిబ్బందికి వాస్తవాలు తెలియజేయకుండా నియమించారు. దీంతో పాటు సదరు సిబ్బంది నుంచి కొందరు కౌన్సిలర్లు డబ్బులు వసూలు చేసినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై సమగ్ర విచారణ జరుపాలి.

- కుదరవెల్లి బసవయ్య, సామాజిక కార్యకర్త

సరికొత్తగా సర్వేల్ గురుకులం

- అందుబాటులోకి నూతన భవనాలు
- రూ.20 కోట్లతో నిర్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- కార్పొరేట్‌ను తలదన్నేలా పాఠశాలల గదులు, వసతి
- రేపు ప్రారంభించేందుకు ఏర్పాట్లు

అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన సర్వేల్ గురుకుల భవనం

సంస్థాన్ నారాయణపురం, నవంబర్25 : ఎంతో మందిని ఉన్నత విద్యావంతులుగా, ఉన్నతాధికారులుగా తీర్చిదిద్దిన దేశంలోనే మొట్ట మొదటి గురుకులం సర్వేల్. ఈ పాఠశాలలో ఇప్పటి వరకు 3,500 మంది విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని బయటకు వెళ్లారు. వారిలో 40 మందికిపైగా ఐఏఎస్, ఐపీఎస్ ఆల్ ఇండియా సర్వీస్‌లో ఎంపికై దేశ వ్యాప్తంగా సేవలందిస్తున్నారు. 500 మంది వరకు అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో ఉన్నత స్థితిలో ఉన్నారు. ఇంజినీర్లు, డాక్టర్లు, రాజకీయంగా ఎదిగిన వారూ ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారు లెక్కకు మించి ఉన్నారు. 53 సంవ్సరాల క్రితం నిర్మించిన గురుకుల పాఠశాల తరగతి గదులు, భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన రూ.20 కోట్లతో అన్ని హంగులతో నూతన భవనాలు నిర్మించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన ప్రత్యేక నిధులు రూ.కోటి మంజూరు చేసి అత్యాధునిక ఫర్నిచర్, డైనింగ్ టేబుళ్లు, బెడ్స్, పెయింటింగ్ పనులు పూర్తి చేశారు. ఈ నెల 27న నూతన గురుకుల పాఠశాల భవనాలను ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

దేశంలోనే మొట్ట మొదటి గురుకులం

సర్వేల్ గ్రామానికి చెందిన సర్వోదయ నాయకుడు మద్ది నారాయణరెడ్డి ఒకసారి విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ కోల్‌కతాలో ఏర్పాటు చేసిన శాంతినికేతన్‌ను సందర్శించారు. ఆ సమయంలోనే ఆయన సర్వేల్ గ్రామంలో గురుకులాన్ని స్థాపించాలని నిర్ణయించుకున్నారు. తన ఆలోచనలను అప్పటి సీఎం పీవీ నరసింహారావుతో పంచుకున్నారు. గ్రామంలో మద్ది నారాయణరెడ్డి నెల కొల్పిన సర్వోదయ ట్రస్టు స్థలాన్ని గురుకుల పాఠశాలకు కేటయించాలని నిర్ణయించుకున్నారు. గురుకుల పాఠశాల ఏర్పాటుకు 44 ఎకరాల భూమిని ఇచ్చేందుకు ముందుకు రావడంతో 1971 నవంబర్ 23న పీవీ నరసింహారావు స్వయంగా వెళ్లి గురుకుల పాఠశాలను ప్రారంభించారు. దేశంలోనే ఇది మొట్ట మొదటి గురుకుల విద్యాలయం కావడం గమనార్హం.

రూ.20 కోట్లతో నూతన భవనాలు నిర్మాణం..

సర్వేల్ గురుకులంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆలుమ్ని అసోసియేషన్ సభ్యులు అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం గురుకులంలో నూతన భవనాలు నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేసింది. గురుకులంలో అకాడమీ బిల్డింగ్, ఆడిటోరియం, వసతి గృహం, డైనింగ్ హాల్, గెస్ట్ హౌజ్, స్టాఫ్ క్వార్టర్స్, కంప్యూటర్ డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీ, నాన్ టీచింగ్ స్టాఫ్ బిల్డింగ్‌లను కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా అన్ని హంగులతో నిర్మించారు. పాత భవనంలో అసంపూర్తిగా ఉన్న సౌకర్యాలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. కొత్త భవనాల ప్రారంభం కానుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.